దేశంలో మోదీ ప్రభంజనం



ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా తదితరులు

- రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుస్తాం
- కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా
- హ్యాట్రిక్ మోదీ అంటూ నినాదాలు
- కాషాయమయంగా మారిన ఉప్పల్
- ఉత్సాహంగా ప్రజాసంకల్ప యాత్ర



ఆటోలో ప్రయాణిస్తున్న కేంద్ర మంత్రి రుపాలా

ఉప్పల్: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి మెజార్టీ స్థానాలను దక్కించుకోవడానికి తలపెట్టిన విజయ సంకల్పయాత్ర శనివారం నాగోల్ నుంచి ఉప్పల్ చౌరస్తా మీదుగా రామంతాపూర్ శివాజీ విగ్రహం, హబ్సిగూడ వీధి నంబర్–8 నుంచి హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం, అక్కడ నుంచి హెచ్‌బీకాలనీకి చేరుకుంది. దారి వెంట మోదీ నినాదాలతో మార్మోగింది. హ్యాట్రిక్ మోదీ అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ ప్రాంతాల్లోని కూడళ్లు, కెప్టెన్ వీరా రాజిరెడ్డి విగ్రహం వద్ద ఇలా పలుచోట్ల నాయకులు మాట్లాడారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చీకటి స్నేహం

కాంగ్రెస్ బీఆర్‌ఎస్ చీకటి స్నేహాన్ని ప్రజలు గమనిస్తున్నారని కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాల అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశంలో మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ భారీ మెజార్టీతో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనం మెచ్చిన నేత అని, దేశవ్యాప్తంగా 400 స్థానాలు కైవసం చేసుకుని విజయదుందుభీ మోగిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చీకటి స్నేహాన్ని ప్రజలు గమనిస్తున్నారని, దేశంలో తిరిగి మోదీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, తూళ్ల వీరేందర్‌గౌడ్, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారి శ్రీవాణి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో రిక్షా కార్మికులకు మద్దతుగా..

రాష్ట్రంలో ఆటో యూనియన్ కార్మికుల సమస్యలపై తమకు వినతి పత్రాన్ని అందజేశారని కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రుపాలా అన్నారు. ఆటో కార్మికులకు మద్దతుగా బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావుతో కలిసి ఆటోలో ప్రయాణించి తమ మద్దతు తెలిపారు.

యాత్రకు స్వాగతం పలికిన బీజేపీ నేతలు

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో జరిగిన విజయ సంకల్ప యాత్రకు నాచారం, మల్లాపూర్ బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. హబ్సిగూడ నుంచి నాచారం, మల్లాపూర్ మీదుగా హెచ్‌బీ కాలనీకి విజయ సంకల్ప యాత్ర సాగింది.

మరోమారు మోదీని ప్రధాని చేసేందుకే..

కుషాయిగూడ: సమర్థవంతమైన నాయకత్వం కలిగిన మోదీని మరోమారు ప్రధానమంత్రిని చేయాలని కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా సీట్లు సాధించి మరోమారు మోదీని ప్రధాని చేసేందుకే విజయ సంకల్పయాత్ర సాగుతుందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీజేపీని గెలిపించాలన్నారు.

రవీంద్రభారతిలో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను పరిశీలిస్తున్న
డాక్టర్ వత్సలారాణి, డాక్టర్ కరుణాకర్

మేడిపల్లి: బోడుప్పల్ రవీంద్రభారతి పాఠశాలలో విద్య వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నేషనల్ సైన్స్ డే పురస్కరించుకొని శనివారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వత్సలారాణి, డాక్టర్ కరుణాకర్ హాజరై నమూనాలను సందర్శించి విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయభాను, డీన్ ప్రమీల, డీఐ క్రాంతికుమార్, హరిప్రకాశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

కుషాయిగూడ: వేసవి దృష్ట్యా డివిజన్‌లో నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. తన క్యాంపు కార్యాలయంలో యూజీడీ, వాటర్ వర్క్స్ అధికారులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా తన దృష్టికి వచ్చిన నీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ సమస్యలపై వారితో చర్చించారు. కుషాయిగూడ, ఓల్డ్ విలేజ్, గణేష్‌కాలనీ, ఐజీ కాలనీ, నేతాజీనగర్ కాలనీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని కోరారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో వాటర్‌వర్క్స్ డీజీఎం సతీష్, ఏఈ రోహిత్‌తో పాటు స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో
కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

హత్యకు కారణం.. వివాహేతర సంబంధం




వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ పద్మాజారెడ్డి,
ఏసీపీ పురుషోత్తంరెడ్డి తదితరులు



నిందితులు

ఉప్పల్: మరదలితో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే కాకుండా ఆమె కూతురిపై కూడా కన్నేసి వేధిస్తున్న వ్యక్తి కళ్లలో కారం చల్లి కత్తులతో పొడిచి అంతమొందించిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ కేసు వివరాలను మల్కాజిగిరి డీసీపీ పద్మజా, ఏసీపీ పురుషోత్తంరెడ్డితో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉప్పల్ ఆదర్శ్‌నగర్ ప్రాంతానికి చెందిన పుస్తకాల శారద(40) ప్రైవేట్ ఉద్యోగి. రాఘవేంద్ర నగర్ కాలనీలో నివాసం ఉంటోంది. భర్త చనిపోయిన తర్వాత ఉప్పల్ ఆదర్శ్‌నగర్‌లో నివాసముండే బావ పుస్తకాల సాయి కుమార్(43)కు మరదలు ఇయిన శారదతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అక్కడితో ఆగకుండా మరదలు కూతరు పుస్తకాల శివానీ(23)ని కూడా నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన తల్లీ కూతుళ్లు ఇదే విషయాన్ని తన కుటుంబానికి చెందిన పీర్జాదిగూడలో నివాసముండే పుస్తకాల దీపక్ కుమార్(42), అదేవిధంగా దూరపు బంధువైన చంపాపేట ప్రాంతానికి చెందిన యల్ల బాలకృష్ణ(35) విషయాన్ని వివరించారు. గతంలో పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. అయినా బుద్ధి మారలేదు. దీంతో సాయికుమార్ అడ్డు తొలగించుకోవాలని నలుగురు ప్లాన్ వేశారు. ఈ నెల 21వ తేదీన సాయి కుమార్‌ను ఉప్పల్ జెన్‌ప్యాక్ట్ వీధిలోకి పిలిపించారు. ఆ సమయంలో దీపక్, బాలకృష్ణ పక్కన దాగి ఉన్నారు. అతను రాగానే కళ్లలో కారం చల్లారు. అక్కడే మాటు వేసిన ఆ ఇద్దరు కత్తులతో పొడిచారు. మృతి చెందాడనుకున్న తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం వేట ప్రారంభించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా క్లూస్ సేకరించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఎ–1గా ఉన్న పుస్తకాల దీపక్‌కుమార్ భార్య హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ఎ–4 నిందితుడిగా ఉన్న యల్ల బాలకృష్ణ ఉప్పల్‌లో తండ్రి కొడుకులను దారుణంగా హత్య చేసిన కేసులో జైల్‌కు వెళ్లి వచ్చాడు.

వసతులు బ్రహ్మాండం



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న కీసరగుట్ట ఆలయం

మహాశివరాత్రి ఉత్సవాలకు కీసరగుట్ట ముస్తాబు

వచ్చేనెల 6వ తేదీ నుంచి 11 వరకు జాతర



క్యూలైన్లు

కీసర: వచ్చే నెల 6వ తేదీ నుంచి 11 వరకు జరుగనున్న కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. గుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈసారి జాతరకు లక్షల మంది భక్తులు వస్తారన్న అంచనాతో అధికారులు ఆ మేరకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ గౌతమ్ ఒకసారి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించడంతో పాటు ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈక్రమంలో మరోసారి కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లకు సంబంధించి రెండోసారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ నాగలింగం తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి లడ్డూ ప్రసాదం తయారీ చేపట్టనున్నారు.

పనులు పరిశీలించిన ఆర్డీఓ

బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్, వాహనాల పార్కింగ్, రోడ్డు విస్తరణ పనులపై పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీ దర్శనాలకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఆయన వెంట కుషాయిగూడ ఏసీపీ నరేశ్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య, ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ నరేందర్, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన ఆలయానికి పంచ రంగులు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా..



సామాన్య భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏరాట్లు చేస్తున్నాం. గర్భాలయంలో కొలువైన స్వామివారిని ఒకేసారి నలుగురు దర్శించుకునేలా క్యూలైన్ల నిర్మిస్తున్నాం. వీవీఐపీలకు ప్రత్యేక క్యూలైన్ ఉంటుంది. శీఘ్ర దర్శనం, అభిషేకం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. ఈసారి ప్రసాదాల కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.
– తటాకం నాగలింగం, ఆలయ చైర్మన్



కీసరగుట్ట జారత జరిగే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో
ట్రాక్టర్‌తో చదును చేస్తూ..

పనులు ఇలా..

1. గుట్ట పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన ఆలయం, రాజగోపురాలు, ఆంజనేయ స్వామి విగ్రహానికి, మహామండపానికి రంగులు వేయడం.
2. మరోవైపు హుడా పార్కు నుంచి ఉత్తర ద్వారం మీదుగా స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లు, భక్తులు సేద తీరేందుకు ఆంజనేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం.
3. కమాన్ నుంచి గుట్ట వరకు ఆర్ అండ్ బీ రహదారి విస్తరణ పనులు.
4. విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు.
5. కీసరగుట్ట దేవస్థానం చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్‌ల ఆధ్వర్యంలో కీసర నుంచి గుట్ట ప్రధాన ఆలయం వరకు సైన్‌బోర్డుల ఏర్పాటు.
6. ఆర్‌డబ్ల్యూఎస్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ చదునుతో పాటు మరుగుదొడ్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: రాపోలు సందీప్ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బోడుప్పల్ అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు రాపోలు రాములు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు షుగర్, బీపీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియామకం

అల్వాల్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ మీడియా సెల్ కన్వీనర్‌గా అల్వాల్‌కు చెందిన తాళ్ల వినయ్‌శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీ కార్యాలయం నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవినాయక్



మల్లాపూర్: బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాచారం డివిజన్‌కు చెందిన రవి నాయక్ నేనావత్ మూడవసారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ నాయక్ నేనావత్ రవినాయక్‌కు నియామకపు ఉత్తర్వులను అందజేశారు.

శివనామస్మరణతో అన్నీ శుభాలే..

మల్లాపూర్: శివనామస్మరణతో అన్నీ శుభాలే కలుగుతాయని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ నెహ్రూనగర్‌లో గురుస్వామి గాజుల కిషోర్ ఆధ్వర్యంలో శనివారం ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ నిర్వహించారు. ప్రత్యేక పూజకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో శివ గురుస్వాములు రాము, నర్సింహారెడ్డి, తిరుపతయ్య, శ్రీను, శివ, మహేష్, బీఆర్‌ఎస్ నేతలు వాసుగౌడ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి వినతి



హబ్సిగూడ: అసెంబ్లీ చాంబర్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య ఆధ్వర్యంలో శనివారం కలిశారు. రాష్ట్రంలోని మాదిగ ఉపకులాల సమస్యలను చర్చించి, రాష్ట్రంలో ఉన్న అసైన్‌మెంట్ భూములపై నివేదిక సమర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కూరెల్ల రమేష్, యువకవి బైరపాక స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జమునయ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రమణ, నాయకులు సుధాకర్, మహేందర్, మణికుమార్ ఉన్నారు.

విద్యాజ్యోతిలో ఎల్లో డే



బోడుప్పల్: విద్యార్థులు రంగుల పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎల్లో డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపడం కోసం, పండ్లు, కూరగాయల పట్ల అవగాహన కలిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అన్నిరకాల రంగుల పట్ల అవగాహన కలిగి ఉండటం ఎంతో ఉపయోగకరం అన్నారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయులు జ్యోతి, దివ్య, మాధవి, వాణి, విద్యార్థులున్నారు.

దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

ఉప్పల్: మహిళ నుంచి నగలు దోపిడీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ పద్మాజా, ఏసీపీ పురుషోత్తం వివరాలను వెల్లడించారు. ఉప్పల్ విజయపురి కాలనీలో నివాసం ఉంటున్న రమాదేవి(62) డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంది. కొడుకు యూఎస్, కూతురు ఒడిశాలో ఉంటున్నారు. రమాదేవికి బంధువైన దాసరి సాత్విక్(29) జల్సాలకు అలవాటుపడి యాప్‌ల ద్వారా లోన్లు తీసుకుని అప్పుల పాలయ్యాడు. రమాదేవి ఫంక్షన్స్‌కు వెళ్లేటప్పుడు ఒంటి మీద నగలు పెట్టుకుని వెళ్లడం గమనించే వాడు. సొమ్ములను కాజేయాలని స్నేహితులైన పటాన్‌చెరు బీరంగూడ ప్రాంతానికి చెందిన అనిల్ కుమార్(36) వృత్తి క్యాటరింగ్. బీహెచ్‌ఈఎల్ ప్రాంతానికి చెందిన గడ్డి సాయికుమార్(21)తో కలిసి పథకం వేశారు. సెల్ఫ్ డ్రైవ్ కార్‌ను అద్దెకు తీసుకుని 19వ తేదీన సాయికుమార్, అనిల్ కుమార్ ఇద్దరూ కార్‌లో ఉప్పల్‌లోని రమాదేవి ఇంటికి వచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇప్పిస్తామని, అధికారులు పక్క వీధిలో ఉన్నారు. మిమ్మల్ని తీసుకుని రమ్మంటున్నారని ఆమెను కారులో ఎక్కించుకుని ఉప్పల్ నాగోల్ మెట్రోస్టేషన్ వద్దకు తీసుకువచ్చి కత్తులతో బెదిరించి నగలు దోచుకుని పారిపోయారు. బాధితురాలు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను శనివారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 8 తులాల బంగారు నగలు, కారు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ గంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌లోని ఆరో అంతస్తులో గుర్తుతెలియని వ్యక్తి(30) ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందన్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ..

అల్వాల్: అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ సామల లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సామల లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు లక్ష్మణ్‌యాదవ్, జీకె.హన్మంతరావు, ప్రసాద్, రాకేష్, మల్లేష్‌యాదవ్, నామదాసు, తిరుపతిరావు, ధర్మారావు ఉన్నారు.

చర్లపల్లి జైల్‌లో జైల్ అదాలత్

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో శనివారం జైల్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మందికి చెందిన 16 కేసులకు పరిష్కారం చూపారు. ఈ అదాలత్‌లో ఎల్‌బీనగర్, హయత్‌నగర్ కోర్టులకు సంబంధించిన న్యాయమూర్తులు పాల్గొని కేసులకు పరిష్కారం చూపారు. న్యాయ సాయం అందని ఖైదీలకు న్యాయసాయం అందించాలనే సంకల్పంతోనే జైల్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్ తెలిపారు. ఉప పర్యవేక్షణాధికారులు కృష్ణమూర్తి, కాళిదాసు, రామకృష్ణ, రావుల సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు



మౌలాలి: క్రికెట్ ఫర్ మల్కాజిగిరి కుత్బుల్లాపూర్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శనివారం మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. వెంకట్‌రెడ్డి, మోహన్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా పుష్కర బ్రహ్మోత్సవాలు



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయంలో శనివారం సప్తాహ్నిక పంచ కుండాత్మక పుష్కర బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవ ఆరంభ స్నపనం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, స్వస్తి పఠణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అంకురారోహణం, నివేదన, తీర్థ ప్రసాద, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ నేతృత్వంలో దేశాభివృద్ధి



బీజేపీలో చేరుతున్న మహిళలు, యువకులు

అల్వాల్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ నేషనల్ ఇన్‌చార్జీ ఉమెన్ పాలసీ అండ్ రీసెర్చ్ కరుణగోపాల్ అన్నారు. ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నేరేడ్‌మెట్‌కు చెందిన మహిళలు, యువకులు కరుణగోపాల్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీలో చేరారు. లయన్ కుప్పుస్వామి, విజయ్‌కుమార్, రాజారామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో అఖండ దీపం



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా అఖండ దీపాన్ని ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ భక్తులు అఖండ దీపంలో నూనె పోసి ఎప్పుడూ వెలిగేలా చూసుకోవాలన్నారు. రఘు పంతులు, సురేందర్‌రెడ్డి, శివరామకృష్ణ, రామచంద్రరావు, రామారావు, రామ్‌నరేష్ పాల్గొన్నారు.


టెలిఫోన్ కాలనీ ఫేస్–2 నూతన కమిటీ

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీ ఫేస్ 2 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోకుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పైల్ల మల్లారెడ్డి, కోశాధికారిగా గోగులోతు సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుమ్మ నాగరాజు, ముఖ్య సలహాదారులుగా బాలకృష్ణ ప్రజాప్రతి, నర్సయ్య, ఉపాధ్యక్షులుగా ముత్తయ్య, యాదగిరి, కనకరాజు, భరద్వాజ్, సహ కోశాధికారిగా వీకే వరప్రసాద్, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, విశ్వేశ్వర్, పద్మారెడ్డి, ప్రచార కార్యదర్శులుగా కరుణాకర్‌రెడ్డి, సమ్మయ్య, యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, రాజు, కుమార్, సాయికిరణ్, యాదగిరి, సందీప్, గణేష్, శ్రీకర్, దయాకర్, ఓంప్రకాశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ టెలిఫోన్ కాలనీలోని సర్వే నంబర్–73/పార్ట్‌ను టెలిఫోన్ కాలనీ ఫేస్–2గా మార్చుకుని నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

15వ డివిజన్ కార్పొరేటర్‌కు వినతి పత్రం

టెలిఫోన్ కాలనీ నూతన కమిటీ ప్రతినిధులు శనివారం 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్‌కు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాలనీలో సీసీ రోడ్లు వేయాలని, ప్రధాన రహదారిలోని 30 అడుగుల రోడ్డులో, లింక్ రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, కాలనీలో రోడ్డు సూచికల బోర్డును ఏర్పాటు చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రంలో కోరారు.

జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సన్మానం



అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించినందుకు, సర్కిల్‌లో గార్బెజ్ వాల్నరబుల్ పాయింట్(జీవీపీ) తొలగించినందుకు అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ మంజుల, శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందిని సత్కరించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ వారికి ప్రశంస పత్రాలు అందించి సత్కరించారు. అల్వాల్ సర్కిల్ సిబ్బంది కౌసర్, శ్రీనివాస్, వెంకటేష్, నాసర్, సతీష్, నాగేష్, భాస్కర్, భాగ్యలక్ష్మీ, ఆంజనేయులు, యూసుఫ్ పాల్గొన్నారు.